జగనన్న విద్యా కానుకలు సిద్ధం


పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

- మండల కేంద్రాలకు తరలించిన పాఠ్య పుస్తకాలు
- నేటి నుంచి పాఠశాలలకు పంపిణీ

అల్లవరం: జగనన్న విద్యా కానుకలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్ట్, బ్యాగ్‌లను పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేందుకు విద్యా శాఖ కార్యాచరణ చేపట్టింది. విద్యార్థుల అవసరాలను బట్టి జగనన్న విద్యా కానుక ద్వారా అందించే ఆరు రకాల వస్తువులను సిద్ధం చేసింది. జిల్లా విద్యా శాఖ నుంచి వస్తున్న పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను పాఠశాలలకు తరలించేందుకు మండల కేంద్రాల్లో ఉంచారు. బెల్టులు, షూష్, సాక్సులు మాత్రం ఇంకా రావాల్సి ఉంది.


ఒకే పాఠ్యంశాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషలో ముద్రించిన పాఠ్య పుస్తకం

ఒకవైపు తెలుగు.. రెండోవైపు ఇంగ్లిష్..

విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, నాడు–నేడు పథకాలతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు విద్యార్థులు మొగ్గు చూపిస్తుండడంతో గత మూడేళ్లుగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అమలాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు మండలాల్లోని 574 పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను జూన్ 1వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలల్లో నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. తెలుగు, ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు స్వతహాగా అవగాహన చేసుకునేలా పాఠ్య పుస్తకాల్లో ఒకే పాఠ్యాంశాన్ని ఒక వైపు తెలుగులో, రెండో వైపు ఇంగ్లిష్‌లో ముద్రించారు. దీని వల్ల విద్యార్థులు ఇంగ్లిష్‌లో చదువుకుని తెలుగులో అర్థం చేసుకునే చక్కని అవకాశం లభిస్తుంది. నాన్ లాంగ్వేజెస్ అయిన లెక్కలు, సైన్సు, సోషల్ పాఠ్య పుస్తకాలను రెండు భాషల్లో ముద్రించడం విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టే విధంగా ఉందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

గతేడాది విద్యార్థుల జాబితా ఆధారంగా మండలాల వారీగా సిద్ధం చేసిన పుస్తకాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	కావలసిన పుస్తకాలు	అందుబాటులో ఉన్నవి	రావాల్సినవి
అల్లవరం	79	4893	62620	32460	31771
అమలాపురం	106	9023	101384	53029	50848
ఉప్పలగుప్తం	83	5317	58613	30478	25158
ముమ్మిడివరం	75	7921	56038	29224	28358
కాట్రేనికోన	75	6404	68272	34992	34445
ఐ.పోలవరం	79	5596	61986	32196	30512
తాళ్లరేవు	77	8316	95020	49412	47823

తొలి రోజునే విద్యాకానుక

జూన్ ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూలు పాఠశాలలకు పంపిణీ చేస్తాం. పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందజేస్తాం. ఇప్పటివరకూ 53 శాతం పాఠ్య పుస్తకాలు, 62 శాతం నోట్ పుస్తకాలు, 70 శాతం వర్కు బుక్స్, 97 శాతం షూలు మండల కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.
– కె.కిరణ్‌బాబు, ఎంఈఓ, అల్లవరం

క్లుప్తంగా

వైభవంగా కామాక్షీ రామలింగేశ్వర కల్యాణం

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠం మహా సంస్థానంలో 55 ఏళ్ల కిందట ప్రతిష్ఠించిన కామాక్షీ రామలింగేశ్వర దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. పీఠాధిపతి కామేశ మహర్షి సమక్షంలో కమనీయంగా సాగిన కల్యాణాన్ని వందలాది మంది భక్తుల వీక్షించారు. లలితా సహస్రం, కామాక్షీ చాలీసా, శివ స్తోత్రాలు, కామాక్షీ స్తోత్రాలతో పీఠం మారుమోగింది. తొలుత కామాక్షీ రామలింగేశ్వరులను దర్శించుకున్న భక్తులు అనంతరం పీఠాధిపతి కామేశ మహర్షి ఆశీస్సులు తీసుకున్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన


ఇంద్రజాల ప్రదర్శన ఇస్తున్న శ్యామ్

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం గ్రామం నందులవారి మెరకలో బుధవారం బాలల వేసవి వినోద కేంద్రం వద్ద ఇంద్రజాల ప్రదర్శకుడు చింతా శ్యామ్‌కుమార్ ఇంద్రజాల ప్రదర్శన చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. విజ్ఞానంతో కూడిన వినోదాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్ ఇంద్రజాలం వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను వివరించారు. తొలుత జనవిజ్ఞాన వేదిక నాయకుడు కేవీవీ సత్యనారాయణ గురజాడ దేశభక్తి గేయం ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో జ్యోతిబసు, పి.వెంకటేశ్వరావు, వై.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో....

ముమ్మిడివరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రవీంద్ర ప్రైమరీ స్కూల్లో నిర్వహిస్తున్న వేసవి వినోద కేంద్రంలో ప్రముఖ ఇంద్రజాలకుడు చింతా శ్యామ్‌కుమార్ ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎన్.అబ్బులు, బి.బాబురావు, ఎస్.శ్రీనివాస రావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో మెగా జాబ్ మేళా

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 2వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 15 కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళాలో 1150 ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీడీఎం ఫార్మసీ, పీజీ చేసిన ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948404165, 9603161039 ఫోన్ నెంబర్లలో సంప్రదించొచ్చని చెప్పారు.

యువజన హాస్టళ్లలో బస చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

అమలాపురం రూరల్: రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పార్టీ నాయకులు కాలనీల్లో సమావేశాలు, దళిత యువకులతో సంప్రదింపులు, ఎస్సీ మోర్చాచే యువజన హాస్టళ్లలో ఒక రోజు బస కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జంగా రాజేంద్ర కుమార్, కట్టా పద్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు టోపీల పంపిణీ


పోలీసులకు టోపీలు అందజేస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: వేసవి ఎండల నుంచి ఉపశమనానికి పట్టణ ట్రాఫిక్, ఆర్మ్‌డ్ పోలీసులకు ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వంద టోపీలను సమకూర్చింది. స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద చాంబర్ ప్రతినిధుల సమక్షంలో డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డిలు బుధవారం ఉదయం టోపీలను పంపిణీ చేశారు. దాతలను డీఎస్పీ అంబికా ప్రసాద్ ప్రశంసించారు. డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయి బాబు, ఉపాధ్యక్షులు చిట్టూరి పెదబాబు, మోకా వెంకట సుబ్బారావు, చాంబర్ ప్రతినిధులు మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం టౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం ఎస్‌సీడీ సోషల్ వర్కర్ ప్రమీల ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి మొదలైన ర్యాలీ నల్ల వంతెన వరకూ సాగి తిరిగి ఏరియా ఆస్పత్రికి చేరుకుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆస్పత్రి సైక్రియాటిస్ట్ డాక్టర్ సౌమ్య పసుపులేటి పొగాకు వల్ల కలిగే కేన్సర్, గుండెపోటు వంటి అనారోగ్యాలను వివరించారు. ర్యాలీలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జాన్ లెవీ, పట్టణ ఎస్‌ఐ బి.ప్రభాకరరావు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తొలుత అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.

స్వామి, అమ్మవార్ల బాలాలయ ప్రవేశం


వేంకటేశ్వర స్వామి బాలాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని పాతబండారులంకలో ఉన్న పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి వారి నూతన ఆలయ నిర్మాణార్థం నూతనంగా నిర్మించిన బాలాలయంలోకి బుధవారం ప్రవేశం జరిగింది. తొలుత స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి బిళ్ల వారి వీధి నుంచి ఎగ్జిబిషన్ వీధి, వీరభద్ర స్వామి గుడి సెంటర్, వల్లూరి పుంత మీదుగా బాలాలయం వరకూ వాహనోత్సవం నిర్వహించారు.
కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు, ఎంపీటీసీ అంకం హిమభారతి, మాడా దుర్గ, ఉప్పుగంటి భాస్కరరావు, చింతపట్ల గంగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.55 లక్షల విరాళం

వేంకటేశ్వర స్వామి వారి నూతన ఆలయం నిర్మాణానికి స్థల సేకరణ కోసం చింతపట్ల సత్యనారాయణ, సీతారత్నం దంపతులు రూ.55 లక్షలు విరాళంగా అందజేశారు.

సాంఘిక బహిష్కరణ ఫిర్యాదుపై విచారణ


సింగరాయిపాలెంలో గ్రామస్తులను విచారిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెంలో ఒకే సామాజిక వర్గంలో ఏర్పడిన విభేదాల కారణంగా తమ కుటుంబాలను సంఘ పెద్దలు సాంఘిక బహిష్కరణ చేశారంటూ పరమట రాజశేఖర్, రాజేశ్వరి, గిడ్ల పార్వతి తదితరులు ఈ నెల 29న జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ సమక్షంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ ఎంవీ రమణలు బుధవారం బహిరంగ విచారణ చేపట్టారు. గ్రామంలో ఇరుపక్షాలతో సమావేశమై వారికి నచ్చజెప్పి సయోధ్య కుదిర్చారు. ఇరు పక్షాలు తామంతా కలిసి ఉంటామని అధికారుల సమక్షంలో లిఖితపూర్వకంగా సంతకాలు చేసి ఇచ్చారు. గ్రామంలో పరిస్థితులపై జూన్ 7న మరోసారి తుది సమావేశం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ వ్యక్తిగత బాధ్యత కావాలి


పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించి పర్యావరణ హిత జీవన శైలిని అలవరచుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం జరిగిన పర్యావరణ హిత జీవన శైలి ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వార్డు సచివాలయాల పర్యావరణ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ దాసరి సత్యనారాయణ, తోకల సత్యనారాయణ, పర్యావరణ కార్యదర్శి బండి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ రైలుకు నిధులు కేటాయించాలి


మంత్రి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందిస్తున్న జేఏసీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ వాసుల చిరకాల వాంఛ అయిన కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమిస్తున్న నిధులకు తోడు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు కూడా మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కోనసీమ జేఏసీ, కోనసీమ జిల్లా పరిరక్షణ ఐక్య సమితి ప్రతినిధులు వినతి పత్రం అందించారు. మంత్రి రామచంద్రారెడ్డిని విజయవాడలో బుధవారం కలిసి ముఖ్యమంత్రి జగన్‌తో ఈ విషయాన్ని చర్చించి నిధుల విడుదలకు సహకరించాలని జేఏసీ ప్రతినిధులు అభ్యర్థించారు. మంత్రిని కలిసినవారిలో జిల్లా పరిరక్షణ సమితి, కోనసీమ జేఏసీ ప్రతినిధులు నల్లా విష్ణుమూర్తి, బండారు రామ్మోహన్ రావు, నల్లా పవన్‌కుమార్, కేబీఆర్ నాయుడు, యార్లగడ్డ రవీంద్ర తదితరులున్నారు.
అమలాపురం రూరల్: కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులివ్వాలని ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోనసీమ జేఏసీ కార్యవర్గం కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధుల విడుదలకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

యానాం: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా కచ్చితంగా వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఓఎన్‌జీసీ సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం నియోజకవర్గంలో కంటి సంబంధిత వ్యాధులకు పూర్తిస్థాయిలో ప్రజలకు ఉచితంగా చికిత్సతో పాటు క్యాటరేక్ట్ ఆపరేషన్లు చేయించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు. శిబిరంలో సుమారు 270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 21 మందికి కంటి ఆపరేషన్లు అవసరముందని వైద్యులు నిర్ధారించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం పరమహంస యోగానంద నేత్రాలయకు పంపించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఓఎన్‌జీసీ డైరెక్టర్ మాలిక్, లయన్స్ పిల్లారాయ యానాం అధ్యక్షుడు పులవర్తి శ్రీను, చెక్కల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరుని కల్యాణం

పి.గన్నవరం: కుందాలపల్లిలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పినిశెట్టి శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో అర్చకస్వామి కొత్తలంక కామేశ్వరరావు నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

సంధిపూడిలో..

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసి యున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయ ఆవరణలో దేవతామూర్తుల విగ్రహాలను నెలకొల్పిన ఆలయ పురోహితులు ఇలపర్తి రాము, ఇలపర్తి వెంకటేశ్వర రావు వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలు భక్తులకు విచ్చేసి స్వామికి తమ మొక్కులను తీర్చుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువుదీరిన చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దివ్య తిరు కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వార్ల అష్టమ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం 8.57 గంటలకు పలువురు భక్త దంపతులు స్వామి వార్ల కల్యాణ క్రతువులో పాల్గొన్నారు దీనిలో భాగంగా ఉదయం 5.30 గంటలకు స్వామి వారి ధ్రువమూర్తులకు 'విశేష అభిషేకం' జరిపించారు. స్వామి వార్ల కల్యాణం అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్వామి వార్ల గ్రామోత్సవం, తదుపరి పుష్పోత్సవం ఘనంగా జరిగాయి. పలువురు భక్త దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: వివాహితను ఓ యువకుడు పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న నేపథ్యంలో ఆ వివాహిత మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగలకుర్రు నెల్లివారిపేటకు చెందిన ఓ మహిళకు ఏడేళ్ల క్రితం అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వ్యక్తితో వివాహం జరిగిందని వారికి ఇరువురు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. పుట్టింటికి వచ్చిన వివాహితను అదే పేటకు చెందిన నెల్లి అనిల్ తరచూ వెంటపడి పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటంతో మనస్థాపానికి గురై ఈ నెల 29 రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. దీంతో స్థానికులు ఆమెను వైద్య చికిత్స నిమిత్తం అమలాపురం ఆస్పత్రికి తరలించారు. వివాహిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతానికి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత మహిళలు అధికారులకు, ప్రజాప్రతినిదులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది మహిళలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సుమారు 50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, ఎప్పుడూ మురికి నీరు, వర్షం నీరు సమస్య లేదని, అయితే సుమారు ఏడాదిగా మురికినీరు, వర్షంనీరు పోయే మార్గం లేకుండా పోయిందని వాపోయారు. తాళ్లమ్మ గుడి వీధిలో ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రెండు బైక్‌ల చోరీ

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డు వద్ద, పశువుల సంతలోను బుధవారం పార్కింగ్ చేసిన రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. సఖినేటిపల్లి మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన ఆచంట శ్రీనివాస రావు తన బైక్‌ను మార్కెట్‌యార్డు బయట ఉంచి అరటిగెలలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అరగంట తరువాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. అలాగే రామరాజులంకు చెందిన వాతాడి మసేను రావు తన బైక్‌ను పశువుల మార్కెట్ వద్ద ఉంచి పనులు చూసుకుని వచ్చే ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

బైక్ చోరీపై కేసు

పి.గన్నవరం: స్థానిక సంత మార్కెట్లో బైక్‌ను చోరీ చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన భీమనాథం నారాయణమూర్తి మే 23న బైక్‌పై రావులపాలెం వెళ్లారు. తిరుగు క్రమంలో పి.గన్నవరం సంతమార్కెట్ బయట బైక్‌ను పార్కు చేసి, లోపలికి వెళ్లారు. తిరిగివచ్చే సరికి బైక్ లేదు. దీంతో ఆయన పరిసర ప్రాంతాలు గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నిరుపేదకు సాయం

సఖినేటిపల్లి: స్థానిక రత్నాలపేటకు చెందిన రత్నా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక బాడిరేవు వంతెన ఏరియాకు చెందిన నిరుపేద ఆకుల బేబీ వెంకటలక్ష్మికి రూ.10,000 ఆర్థిక సాయం పంపిణీ చేశారు. రత్నాలపేటకు చెందిన దాత, ట్రస్ట్ ప్రతినిధి గొల్ల విజయ్‌ప్రకాష్ పై మొత్తాన్ని సమకూర్చారు. ఈ మేరకు దీనిని వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్‌లు ఆమెకు అందజేశారు. పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పార్టీ నాయకుడు రాపాక సూర్యప్రకాష్, స్థానికులు గెడ్డం డేవిడ్, తాడి సహదేవ్, నల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కలైమామణి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న వారి నుంచి 2022–23 ఏడాదికి పుదువై కలైమామణి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ డైరెక్టర్ వి.కళై పెరుమాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాహిత్యం, సంగీతం, డ్రామా, నృత్యం, ఫైన్‌ఆర్ట్స్, శిల్పం అండ్ ఫోక్ ఆర్ట్స్(తెలుగు, తమిళం, మళయాలం) రంగాల్లో రాణిస్తున్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు పుదుచ్చేరి నివాసితులై ఉండాలని లేదా అయిదేళ్లకు తక్కువ కాకుండా రెసిడెన్స్ కలిగి ఉండాలన్నారు. సంబంధిత దరఖాస్తులను రీజినల్ అడ్మినిస్ట్రేటర్, యానాం వారికి ఈ నెల 15లోగా అందజేయాలని కోరారు.

సూపర్ స్టార్ కృష్ణ జయంతి


కేక్ కట్ చేస్తున్న అభిమాన సంఘం నాయకులు

అమలాపురం రూరల్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా అమలాపురం శేఖర్ థియేటర్ వద్ద పట్టణ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కొప్పిశెట్టి నరసింహమూర్తి, పాటి రవి, దొంగ శ్రీను, కె.రమేష్, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదనంగా కల్వర్టు నిర్మాణం


సామంతకుర్రు కెనాల్‌పై నిర్మిస్తున్న కల్వర్టు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని పెదాంధ్రపేట వద్ద సామంతకుర్రు కెనాల్‌పై నిబంధనలకు విరుద్ధంగా కల్వర్టు నిర్మాణం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెనకు 150 మీటర్ల దూరంలోనే రెండు వైపులా కల్వర్టులున్నా ఎవరో తమ స్వప్రయోజనాల కోసం కాలువ వెడల్పు తగ్గించి మరీ కల్వర్టు నిర్మిస్తున్నారని స్థానిక రైతులంటున్నారు. తక్షణమే కల్వర్టు నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు, స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ రెహమాన్‌ను వివరణ కోరగా కల్వర్టు వద్ద వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తానని బదులిచ్చారు.

ఉత్తమ సేవల ద్వారా గుర్తింపు


వైద్యుడు అమిత్‌దాస్‌ను సత్కరిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా వైద్యులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ అమిత్‌దాస్ పదవీ విరమణ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఏర్పాటుచేసిన సత్కార కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమిత్‌దాస్ కఠినమైన ఆపరేషన్లు సైతం తనదైన శైలిలో ఎంతో చాకచక్యంగా చేసి రోగుల మన్ననలు పొందారన్నారు. అనంతరం అమిత్‌దాస్‌ను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్, వైద్యులు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పాలమర్తి వీర అంజికుమార్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్ జరిగింది. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం చొప్పెల్లకు చెందిన అంజికుమార్‌ను ఈనెల 25న రాత్రి పదిగంటల సమయంలో గ్రామానికి చెందిన మంగిన సాయి, దొండపాటి తేజ, వంగా సాయి, మెర్ల కిరణ్ బ్లేడ్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్ ఆదేశాల మేరకు గాలింపు చర్యలు చేపట్టారు.దీంతో మడికి మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు మేజర్లు కాగా మరో ఇద్దర మైనర్లుగా పోలీసులు గుర్తించారు. వీరికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి నిందితులకు 15 రోజుల రిమాండ్ విధించారు.